# ప్రియ మిత్రులకు...



## 1

*[ప్రమదదాస మిత్రకు]* బారానగర మఠం,

నవంబరు, 19,1888

ఓం నమో భగవతే శ్రీరామకృష్ణాయ

మాన్య మహాశయా,

మీరు పంపిన రెండు పుస్తకాలు అందాయి. అత్యంత అనురాగంతో వ్రాసిన మీ ఉత్తరం నాకెంతో ఆనందాన్నిచ్చింది. సువిశాలమూ, ఔదార్య భరితం అయిన మీ హృదయానికి అది తార్కాణం. నా పూర్వపుణ్య పరిపాకాన, బిచ్చమెత్తుకొని జీవించే సన్న్యాసి అయిన నా పట్ల, మీరు ఇంతటి కారుణ్యాన్ని చూపిస్తూన్నారు. మీరు మాకు వేదాంత గ్రంథాన్ని దానం చేయటం చేత నేను ఒక్కడినేకాక శ్రీరామకృష్ణుల అనుయాయులైన సన్న్యాసులందరు ఆజన్మాంతం మీకు ఋణపడి ఉంటారు. వారు అందరూ మీకు భక్తిపూర్వకంగా ప్రణమిల్లుతున్నారు. పాణినీయ వ్యాకరణాన్ని పంపమని మిమ్మల్ని ప్రార్థించినది కేవలం నా కోసమే కాదు. ఈ మఠంలో ఉన్నవారు అకుంఠిత దీక్షతో సంస్కృత గ్రంథాలన్నీ చదువుతున్నారు. వారిలో చాలామందికి సంస్కృతభాష సువిదితమే. ఈ వంగ రాష్ట్రంలో, వేద ప్రచారం బాగా తగ్గినట్లుగా కనిపిస్తోంది. అందువల్ల ఈ మఠంలోని వారికి వేదసంహితలను నేర్పాలని నా అభిమతం. దేనిని చేపట్టినా దానిని సమగ్రంగా నిర్వహించాలన్నదే వారి అభిలాష. పాణినీయ వ్యాకరణంలో మొదట నిష్ణాతులు కానిదే, వైదిక వాఙ్మయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకోవటం అసాధ్యమని నా నమ్మకం; అందుకే ఈ పుస్తక ఆవశ్యకత. బాల్యంలో మేము చదివిన 'ముగ్ధబోధ', 'లఘుకౌముది' కంటే ఎన్నో విధాల

యోగ్యమైందని అనుకొంటున్నాను. మహావిద్వాంసులైన మీరే ఈ విషయంలో వరిష్ఠులైన గుణనిర్ణేతలు. పాణినీయ అష్టాధ్యాయి అన్ని విధాల మాకు తగినదని మీరు భావిస్తే, (మీకు వీలుంటే) ఆ గ్రంథాన్ని మాకు పంపితే ఆజన్మాంతం మమ్మల్ని మీకు ఋణగ్రస్థులను చేసుకొనినవారవుతారు. మఠంలో దీక్ష, ప్రజ్ఞ, సునిశితమైన మేధస్సుగల వ్యక్తులకు కొదవలేదు. మా గురుదేవుల కటాక్షంవల్ల వారు అచిరకాలంలోనే పాణినీయ వ్యాకరణాన్ని నేర్చుకొని, వంగసీమలో వేద పునరుద్ధరణ చేస్తారని ఆశిస్తున్నాను. మా పూజ్య గురుదేవుల రెండు ఛాయాచిత్రాలు, వారి ఉపదేశాలను సంకలనపరచి, సరళభాషలో ముద్రించిన ప్రతులను మీకు పంపుతున్నాను. మీరు దయతో వీటిని స్వీకరించి, మాకు ఆనందాన్ని కలిగిస్తారని ఆశిస్తున్నాను. నా ఆరోగ్యం ఇప్పుడు చాలావరకు మెరుగైంది. రెండు నెలలలో మిమ్మల్ని కలిసే భాగ్యం నాకు లభిస్తుందని విశ్వసిస్తున్నాను.

భవదీయ,

వివేకానంద.

**2**

*[ప్రమదదాస మిత్రకు]* బారానగర్,

ఫిబ్రవరి 4, 1889

ప్రియ మహాశయా,

ఏదో కారణంవల్ల ఈ రోజు నా మనస్సు సంక్షోభంగాను, నిరుత్సాహంగాను ఉంది. దివ్యక్షేత్రమైన వారణాసికి రావలసినదన్న మీ ఆహ్వానం ఈ రోజే నాకు అందింది. దీనిని నేను శ్రీ విశ్వేశ్వరుని ఆజ్ఞగా శిరసావహిస్తున్నాను. ఇప్పుడు నేను నా గురుదేవుల అవతార క్షేత్ర (గయ) యాత్రకు వెళుతున్నాను. అక్కడ కొన్నాళ్ళుండి, మీ సమక్షానికి వస్తాను.

## 12

[స్వామి సదానందకి] ఘాజీపూర్,

ఫిబ్రవరి 14, 1890

ప్రియమైన గుప్తకు,

నువ్వు క్షేమంగా ఉన్నావని తలుస్తున్నాను. ఆధ్యాత్మిక సాధన సాగిస్తూనే ఉండు. నువ్వు అందరికీ సేవకుడవనే విషయాన్ని గ్రహించి వారిని సేవించు. నువ్వు ఎవరివద్ద ఉన్నావో వారిని సేవించుటకు, వారి పాదధూళి తలదాల్చుటకు కూడా నాకు అర్హత లేదని గ్రహించి, వారిని సేవిస్తూ వారియందు భక్తి కలిగివుండు. ఒకవేళ వారు నిన్ను దూషించినా, లేక హింసించినా నీవు ఏమాత్రం కోపగించుకోకు. స్త్రీలతో అసలు కలవవద్దు. కొద్దికొద్దిగా ధైర్యం అలవరచుకొంటూ, భిక్షాటన నుంచే శరీరపోషణ చేసుకోవడం అభ్యసించు. శ్రీరామకృష్ణుని నామాన్ని జపించే వారెవరైనా సరే, అతడు నీకు గురువని తెలుసుకో. అధికారం చెలాయించడం ప్రతిఒక్కరికీ సులభమేగాని సేవించడం చాలా కష్టం. నువ్వు ముఖ్యంగా శశి[1]ని అనుసరించు. గాఢమైన గురుభక్తి, అచంచలమైన ఓర్పు, దీక్ష కొరవడితే మనం దేనినీ సాధించలేమనే నిజాన్ని గుర్తించు. నీకు నీతియందు నిష్ఠ ఉండాలి. దానినుండి అంగుళం దిగజారినా, నీకిక పతనమే.

భవదీయ,

వివేకానంద.

1. స్వామి రామకృష్ణానంద

## 16

*[స్వామి అఖండానందకి]* ఘాజీపూర్,

మార్చి, 1890

ఓం నమో భగవతే రామకృష్ణాయ

ప్రియమైన అఖండానందునకు,

మంచి విషయాలు ఎక్కడున్నా వాటిని గ్రహించాలన్నదే నా లక్ష్యం. దీనిని చూసి నా మిత్రులు కొందరు నాకు గురుదేవునిపై భక్తి సన్నగిల్లిందని తలపవచ్చు. అటువంటి తలంపులు దురభిమానుల తలంపులనీ, వెర్రి ఆలోచనలనీ నేను భావిస్తున్నాను. గురువులందరు ఒక్కటే. వారందరు విశ్వగురువైన భగవంతునినుండి ప్రసరించే కిరణాలే.....

నువ్వు ఘాజీపూర్ రాదలిస్తే, గోరాబజారులో ఉన్న సతీశ్‌బాబుగారి ఇంట్లో గాని, గగనబాబుగారి ఇంట్లోగాని నేనెక్కడ ఉన్నది అడిగితే తెలుస్తుంది. లేకపోతే పవహారీబాబా ఇక్కడ చాలా ప్రఖ్యాతుడు. ఆయన పేరు చెపితే చాలు. ఎవరైనా ఆయన ఆశ్రమానికి దారి చూపగలరు. నువ్వు అక్కడకు వచ్చి పరమహంసను గూర్చి అడిగితే నా వార్త నీకు తెలుపుతారు. ఘాజీపూర్ రావాలంటే, మొఘల్‌సరాయి జంక్షన్ సమీపంలో ఉన్న, 'దిల్దర్నగర్' అనే స్టేషన్‌లో దిగి చిన్న రైలుకు మారాలి. ఆ రైలులో 'తారాఘాట్'లో దిగితే, దానికి ఎదురుగానే ఘాజీపూర్ ఉంది. ఘాజీపూరు చేరాలంటే మధ్య ఉన్న గంగను దాటాలి.

నేను కొన్నాళ్ళు ఈ ఘాజీపూర్‌లోనే ఉండి, బాబాజీ ఏం చేస్తాడో చూస్తాను. నువ్వు కూడవస్తే మనిద్దరం, నేను పైన పేర్కొన్న భవనంలో

కొన్నాళ్ళుండిన తర్వాత కొండకోనలకో, లేక మరెక్కడికో వెళ్ళాలనుకొంటే అక్కడికి వెళ్దాం. నేను ఘాజీపూర్‌లో ఉన్నట్లు దయచేసి బారానగరవాసులకు తెలియచేయవద్దు సుమా!

ఆశీస్సులతో

భవదీయ,

వివేకానంద.

**17**

*[ప్రమదదాసమిత్రకు]*

ఘాజీపూర్,

మార్చి 3, 1890

ప్రియ మహాశయా,

దయతో మీరు వ్రాసిన ఉత్తరం ఇప్పుడే అందింది. కర్కశ వేదాంత భావాలు కలిగి ఉన్న వాడినైనా, నాది అత్యంత మృదు స్వభావమని మీకు తెలియదు. ఇదే నా కష్టాలన్నింటికీ కారణం. ఏ చిన్న తాకిడి కలిగినా నేను లొంగిపోతాను. నా మంచి గురించి నేనెంత ప్రయత్నించినా, వివశుడనై ఇతరుల క్షేమాన్నే తలపోస్తుంటాను. ఈసారి నా మేలుకోసమే ప్రయత్నించాలనే దృఢసంకల్పంతో బయలుదేరాను. కాని, అలహాబాద్‌లో ఉన్న నా సోదర శిష్యుని అనారోగ్యవార్త అందగానే పరుగెత్తి అక్కడికి వెళ్ళాను. హృషీకేశ్‌నుండి ఇప్పుడీ వార్త వచ్చింది. తక్షణం నా మనస్సు అక్కడకు పరుగెత్తింది....

భవదీయ,

వివేకానంద.

## 30

*[పొ॥ జాన్ హెన్రీ రైట్‌కు]* చికాగో,

అక్టోబర్ 2, 1893

ప్రియ అధ్యాపక్‌జీ,

నేనింతకాలం మౌనంగా ఉన్నందుకు మీరే విధంగా భావిస్తున్నారో నాకు తెలియదు. ఆఖరి క్షణంలో నేను విశ్వమత మహాసభలో ఊడిపడ్డాను. అసంసిద్ధుడిగానే వెళ్ళాను. దానివల్ల కొంతకాలం ఏమాత్రం తీరిక లేకపోయింది. ఇక రెండవ కారణం, నేను ప్రతిరోజు కాంగ్రెసులో తప్పకుండా ప్రసంగించాను. ఏదో తొందరలో అహేతుకమై మైత్రిగలవారూ, నేనెంతో ఋణపడివున్నవారూ అయిన మీకు వ్యావహారిక ధోరణిలో ఒక ఉత్తరం వ్రాయటం అపరాధంగా భావించాను. మహాసభ ఇప్పుడు ముగిసింది.

ప్రియ సోదరా! ప్రపంచం నలుమూలలనుండి వచ్చి ప్రసంగించిన చక్కని వక్తలు, ఆలోచనాపరులతో కూడిన ఆ మహాసభ ముందు నిలబడటానికి నాకు చెప్పలేని భయంవేసింది. కాని నాకు భగవంతుడు ధైర్యస్థైర్యాలను ప్రసాదించాడు. ఒక వీరుని వలె (?) నేను ప్రతిరోజూ ఆ వేదికపై నిలిచి సభాసదులను ఎదుర్కొన్నాను. నేను కృతకృత్యుడనైతే, అది భగవంతుడు ప్రసాదించిన బలమే. ఒకవేళ నేను శోచనీయస్థితిలో పరాజితుడనైతే నేను పరమ అజ్ఞానినని నాకు ముందుగానే తెలుసు.

మా మిత్రులైన 'ప్రొఫెసర్ బ్రాడ్లే'గారు, నాపట్ల ఎంతో దయ చూపి ఎల్లప్పుడు నన్ను ప్రోత్సహించారు. చూడండి! ఎందుకూ కొరగాని నాయందు ఇక్కడి వారందరు చూపిన దయ వర్ణనాతీతం. ఎవని దృష్టిలో, అజ్ఞానియైన ఈ బీద సన్యాసీ, మహత్తరమైన ఈ దేశంలోని విజ్ఞానవంతులైన దివ్యులూ, ఒకటిగా కన్పించారో ఆ దేవదేవునకు జయమగుగాక! సోదరా! నా జీవితంలో

## 35

*[శ్రీ సింగారవేలు ముదలియారుకు]* చికాగో,

మార్చి 3, 1894

ప్రియమైన కిడి,

అంతర్దృష్టికి విశ్వాసం అద్భుతమైన తరుణోపాయం అనేంతవరకు నీతో నేను అంగీకరిస్తున్నాను. కానీ ఆ విశ్వాసంలో ఒక ప్రమాదముంది: ఏమంటే అది పురోభివృద్ధిని ఆటంకపరచి, స్వమత దురభిమానాన్ని కలుగ చేయవచ్చు.

జ్ఞానం మంచిదే కాని దానిలోఉన్న ప్రమాదమేమంటే, ఆ జ్ఞానం శుష్కవేదాంతంగా పరిణమించవచ్చు. భక్తి గొప్పదే; ఉదాత్తమైందే. కాని ఆ భక్తి నిరర్థకమైన భావావేశమై అణగిపోవచ్చు. కాబట్టి మనకు కావలసింది వీటన్నింటి సామరస్యమే. వీటి సామరస్యమూర్తి శ్రీరామకృష్ణులు. ఇటువంటి మహనీయులు చాలా అరుదు. కాబట్టి ఆయనను, ఆయన ఉపదేశాలను ఆదర్శంగా చేసుకొని, మనం అభివృద్ధి చెందవచ్చు. మనలో ప్రతిఒక్కరూ ఆయన పరిపూర్ణతను పొందలేకపోయినా, మనలో ఉన్న లోపాలను సవరించుకొంటూ, మనలో ఉన్న భేదాలను సమన్వయపరచుకొంటూ, మనలో వేరువేరుగా ఉన్న ఆశయాలను పరిపూర్ణం చేసుకొంటూ, కావలసిన సర్దుబాట్లను చేసుకోవటం ద్వారా మనం కూడా ఆయనకున్నటువంటి పరిపూర్ణతను సాధించవచ్చు గదా! ఈ సామరస్యం అనేకమంది ద్వారా ఏర్పడుతుంది. అంతేకాక ఇతర మతసంప్రదాయాలకంటే ఇది ముందంజలో ఉన్నది.

మత ధర్మం ఉదాత్తంగా ఉండటానికి ఉత్సాహం అవసరం. అదే సమయంలో మనం శాఖలను పెంపొందించే ప్రమాదాన్ని వదలాలి. ఈ

## 36

*[శ్రీమతి జి. డబ్ల్యు. హేల్‌కి]* డెట్రాయిట్,
మార్చి 10, 1894

ప్రియ జననీ,

నిన్న సాయంత్రం క్షేమంగా డెట్రాయిట్ చేరాను. బండితోసహా ఆ ఇద్దరు కుమార్తెలు నా కోసం కాచుకొని ఉన్నారు. కాబట్టి అన్నీ సక్రమంగానే జరిగిపోయాయి. అక్కడి బాలికలలో ఒకరు టికెట్లు వేడివేడి అట్లవలె అమ్ముడుపోతాయని చెప్పటంవల్ల ఉపన్యాసం జయప్రదం అవుతుందని భావిస్తున్నాను. తన ఇంటికి వచ్చి అతిథిగా ఉండమని కోరుతూ మిస్టర్ పామర్ వ్రాసిన ఉత్తరం ఇక్కడ నా కోసం వేచివుంది.

నిన్న రాత్రి అక్కడకు వెళ్ళలేకపోయాను. నన్ను తీసుకొని వెళ్ళడానికి ఆయన ఈ రోజు ఎప్పుడో వస్తాడు. మిస్టర్ పామర్ దగ్గరకు వెళుతున్నందువల్ల, భయంకరంగా కట్టబడిన సంచిని తెరువలేదు. దానిని తిరిగి కట్టడం అనే తలంపే నాకు నిరాశాజనకంగా కన్పించింది. మిషిగన్ నగరానికి వేసవిలో వెళ్ళవచ్చుననే తలంపుతో నేను ఇప్పుడు బోస్టన్, న్యూయార్క్ వెళ్ళాలని అనుకొంటున్నాను. కానీ న్యూయార్క్, బోస్టన్లలోని విలాసవంతులు వెళ్ళిపోతారు. భగవంతుడు వారికి దారి చూపుతాడు గాక.

శ్రీమతి 'బాగ్లీ', కుటుంబంలోని వారందరూ నేను వచ్చినందుకు ఎంతో ఆనందించారు. జనం మళ్ళీ నన్ను చూడటానికి వస్తున్నారు.

తాను తీసిన కొన్ని ఫొటోలు ఇక్కడి ఫొటోగ్రాఫరు నాకు పంపాడు. అవన్నీ అసహ్యంగా ఉన్నాయి. శ్రీమతి 'బాగ్లీ'కి అవి ఏమాత్రం నచ్చలేదు. యథార్థ మేమంటే, ఈ రెండు ఫొటోల మధ్యలో నా ముఖం బరువుగాను, లావుగాను తయారైపోయింది – పాపం ఆ ఫొటోగ్రాఫరు ఏం చేస్తాడు?

## 42

*[మైసూరు మహారాజుగారికి]* చికాగో,

జూన్ 23, 1894

మహారాజా,

మిమ్మల్ని, మీవారిని శ్రీమన్నారాయణుడు అనుగ్రహించుగాక! మీరు దయతో చేసిన సాయంతో నేనీ దేశానికి రాగలిగాను. అప్పటినుండి నేను అనేక చోట్ల పరిచయస్థుడనైనాను. ఆతిథ్యం ఇవ్వగల ఉదార స్వభావులైన ఈ దేశప్రజలు నాకు కావలసినవన్నీ సమకూర్చారు... ఇది ఒక అద్భుతమైన దేశం. అనేక విషయాలలో ఇది ఒక అద్భుతజాతి. నిత్యకృత్యాలలో ఈ దేశీయులు ఉపయోగించే యంత్రాలు, మరే ఇతర దేశీయులు ఉపయోగించరు. ఇక్కడంతా యంత్రమయం. వీరు ప్రపంచ జనాభాలో ఇరవైఐదవవంతు మాత్రమే. అయినా ప్రపంచ సంపదలో వీరిది ఆరవవంతు. వారి సంపదకు, వారి భోగభాగ్యాలకు అంతేలేదు. కాని ఇక్కడ ప్రతి వస్తువు విపరీతమైన ధరలో ఉంటుంది. కార్మికులకు ఇచ్చే వేతనాలు ప్రపంచంలోని అన్ని చోట్లకంటే ఎక్కువ. అయినా కార్మికులకు యజమానులకు మధ్య పోరాటం ఎప్పుడూ సాగుతూనే ఉంటుంది.

అమెరికా స్త్రీలకు ఉన్నన్ని హక్కులు ప్రపంచంలో మరెక్కడా లేవు. వారు క్రమంగా అంతా తమ చేతుల్లోకి తీసుకొంటున్నారు. కాని విచిత్రమేమంటే విద్య, సంస్కారంగల పురుషులకంటే, స్త్రీలే ఎక్కువగా ఉన్నారు. కాని అత్యంత ప్రతిభాశాలురైనవారు పురుషులలోనే అధికంగా ఉన్నారు అనడంలో సందేహంలేదు. వర్ణవ్యవస్థను పాశ్చాత్యులు ఎంత విమర్శించినా దానికంటే నికృష్టమైన వ్యవస్థ వారిలో ఉంది. అది డబ్బు. అమెరికన్లు అనేట్లు 'డాలరు దేవుడు' ఇక్కడ చేయలేని పనేలేదు.

## 49

*[అలసింగ పెరుమాళ్‌కు]* అమెరికా,
సెప్టెంబరు 21, 1894

ప్రియ అలసింగా,

.... త్వరలో భారతదేశం తిరిగి రావాలని అనుకొంటున్నాను. ఈ దేశంతో నాకు మొహం మొత్తింది. లెక్కలేనన్ని బహిరంగ ప్రసంగాలు చేయడంచేత, ఎడతెరపిలేని తొందరవల్ల గుండెదడ కలిగింది. ఈ తొందర, నిరర్థకమైన డబ్బు సంపాదనని ఇక లక్ష్యపెట్టను. కాబట్టి త్వరలోనే తిరిగి వస్తాను. అయితే అనేకులలో నా పలుకుబడి పెరిగిపోతోంది. వారు నన్ను ఇక్కడే ఉండమంటున్నారు. కానీ ఈ పత్రికాప్రశంసలు, ఈ డాంబికాలు ఇక చాలనుకుంటున్నాను. ఈ బహిరంగ జీవితాన్ని ఇక లక్ష్యం చేయను...

......సానుభూతివల్ల ఏ దేశంలోగాని ఎక్కువమంది ఉపకారం చేసేవారుండరు. ఇక్కడ డబ్బు ఇచ్చేవారుకూడా నరకభయంవల్ల, మతాచార్యులకు వశవర్తులై ధనం ఇస్తున్నారు. ఇది 'ఆవును చంపి, దాని చర్మంతో కుట్టిన చెప్పులు బ్రాహ్మణుడికి దానం చేయి' అనే పాత బెంగాలీ సామెతలా వుంది. ఇక్కడా అదేవిధం, అన్నిచోట్లా అదేరకం. కానీ మనదేశంతో పోలిస్తే ఈ పాశ్చాత్య దేశస్థులు పిసినారులు. ఆసియా దేశస్థులు ఎక్కువ దానపరాయణులనే నా విశ్వాసం. కాని, వారు నిరుపేదలు.

..... ఈ ప్రసంగ కార్యక్రమాలతో విసుగు పుడుతోంది. ఉత్కృష్టమైన ఆధ్యాత్మికతత్త్వాన్ని అవగాహన చేసుకోవడానికి ఈ పాశ్చాత్యులకు చాలాకాలం పడుతుంది. ఇక్కడివారికి రూపాయి, అణా, పైసలే (పౌన్, షిల్లింగ్, పెన్నీలే) సర్వస్వం. మతం ధనాన్ని, ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని,

## 72

*[స్వామి శివానందకి]* అమెరికా, *1894*

ప్రియ సోదరా, శివానందా,

.... 'అతి సర్వత్ర వర్జయేత్' అతిగా దేన్నికూడ చేయకూడదు. ఈ పత్రికా ప్రశంసలు నాకు కొంత ఖ్యాతి కల్గించినమాట నిజమే. కానీ దాని ప్రభావం ఇక్కడి కంటే భారతదేశంలోనే ఎక్కువగావుంది. నిరంతరమైన పత్రికా ప్రశంసలు ఇక్కడి ఉన్నతవర్గంవారికి అయిష్టత కలిగిస్తాయి. కాబట్టి ఇక ఇవి చాలు. ఈ సభలను పురస్కరించుకొని భారతదేశంలో మీరు ఒక సంఘంగా ఏర్పడటానికి ప్రయత్నించండి. మీరు ఈ దేశానికి ఇంకేమీ పంపనవసరంలేదు.

ఇక డబ్బు విషయమా – మొట్టమొదట అమ్మకు[1] ఒక నివాసగృహం నిర్మింప నిశ్చయించుకొన్నాను. అమ్మ నివాస స్థానానికై రూ. 7,000/– పంపుతాను. మొదట స్థలం లభిస్తే నాకు నిశ్చింతగా వుంటుంది. నేను తిరిగివచ్చినా నాకు ఇక్కడనుంచి సంవత్సరానికి రూ. 1600/– వస్తాయని ఆశిస్తున్నాను. ఆ మొత్తాన్ని మహిళాగృహ ఖర్చుల నిమిత్తం మీకు అప్పగిస్తాను. తర్వాత అది వృద్ధిచెందుతుంది. స్థలం సేకరించమని ఇదివరకే నీకు వ్రాసాను.

ఇంతకుముందే నేను భారతదేశానికి వచ్చేవాణ్ణి. కానీ భారతదేశంలో ధనం లేదు. అక్కడ శ్రీరామకృష్ణ పరమహంసను వేలమంది ఆరాధిస్తారు. కానీ ఒక్క పైసానైనా ఇవ్వరు – అదే భారతదేశం. ఎంత కష్టమైనా మీరు ఈలోపు అన్యోన్యతతో మెలగండి. ప్రజలు సిద్ధాంతాలను లెక్కించరు. వారు

---

1. మాతృదేవి శ్రీ శారదాదేవి.

## 91

*[అలసింగ పెరుమాళ్‌కు]* *అమెరికా సంయుక్త రాష్ట్రాలు,*
*మే 6, 1895*

ప్రియ అలసింగా,

నువ్వు చివర వ్రాసిన ఉత్తరం, రామానుజభాష్యం మొదటి సంపుటి ఈ ఉదయమే అందాయి. కొన్నిరోజులు క్రితం నువ్వు రాసిన మరో ఉత్తరం వచ్చింది. మణి అయ్యర్ రాసిన ఉత్తరమూ చేరింది. నేను క్షేమంగానే ఉన్నాను. మామూలు పద్ధతిలోనే సాగిపోతున్నాను. శ్రీ 'లండ్' అనే వ్యక్తి చేసిన ప్రసంగాలను గురించి ప్రస్తావించావే, అతణ్ణి నేనెరుగను. ఆయన ఎక్కడ ఉండేది తెలియదు. చర్చిలలో బోధించేవారిలో అతడు ఒకడైవుంటాడు. కానీ అతడు ప్రఖ్యాతుడైన వక్త అయితే అతని గూర్చి విని ఉండేవాణ్ణే. బహుశా ఆయన తన ప్రసంగాలను ఏదో పత్రికలో ప్రచురించి వాటిని భారతదేశానికి పంపుతూండవచ్చు. అక్కడి మిషనరీలు వీటిని వ్యాపారానికి వాడుకొంటూండవచ్చు. మీ ఉత్తరాల ధోరణినిబట్టి నేనింతవరకు ఊహించాను. ఇక్కడ 'ఆత్మ రక్షణ' కోసం పోరాడటం అనే విషయాన్ని బయటివారు లెక్కపెట్టరు. ఇది కేవలం వ్యక్తిగత విషయమే. లేకపోతే నేను ప్రతీ రోజూ వందలమంది మనుషులతో పోరాడవలసి ఉంటుంది. భారతదేశ విషయం ఇక్కడ మోగిపోతోంది. సహజంగానే ఇక్కడి సనాతన క్రైస్తవులైనవారు – డాక్టర్ బారోస్‌తోసహా – ఇక్కడ (హిందూమత విషయంలో) చెలరేగుతున్న అగ్నిని చల్లార్చడానికి సతమతమమైపోతున్నారు. ఇక రెండవ విషయం: సనాతన క్రైస్తవులు భారతదేశానికి ప్రతికూలంగా చేసిన ప్రతీ ప్రసంగంలోను నా గురించి చేసిన దూషణ ఎంతో ఉండక తప్పదు. హిందువులైనవారు నిద్రిస్తూండగా ఆ హిందూ మతాన్ని సమర్థిస్తూ నేను నా శక్తిని ఎందుకు

## 144

[కుమారి మేరీ హేల్‌కు] ఎయిర్ల్ లాడ్జి, రిడ్జివే గార్డెన్స్
వింబుల్డన్, ఇంగ్లండ్
సెప్టెంబర్ 17, 1896

ప్రియ సోదరీ,

రెండు నెలలు కొండల నెక్కుతూ, హిమానీనదాలను తిలకిస్తూ, వాటిమీద నడుస్తూ కాలం గడిపి ఈరోజు లండన్ చేరాను. అది నాకొక మంచి చేసింది. నా శరీరంలో అనవసరంగా పేరుకొన్న కొన్ని పౌన్ల కొవ్వును కరిగించి, వాయురూపం పొందించింది. మంచిదే, కాని దాన్లోకూడ భద్రతలేదు. కారణం, పుట్టుకతోనే వచ్చిన ఈ స్థూలశరీరం మనస్సుతో పోటీపడి, దానికంటే ఎక్కువగా పెరిగిపోదలచింది. అలా జరిగితే, బయటి ప్రపంచం గుర్తుపట్టలేనంతగా ఈ శరీరం మారిపోతుంది.

'హేరియట్' ఉత్తరంలోని మంచి వార్తను గురించిన నా ఆనందాన్ని మాటల్లో వెల్లడించటం అసాధ్యం. ఈరోజే ఆమెకు ఉత్తరం వ్రాశాను. ఆమె వివాహానికి ప్రత్యక్షంగా రాలేనని, అయినా నా శుభాశీస్సులతో సహా 'సూక్ష్మశరీరం'లో హాజరవుతానని రాశాను. నా ఆనందం సంపూర్తి కావడానికి నీనుండి, తక్కిన సోదరీమణులనుండి అలాంటి శుభవార్తను ఎదురుచూస్తున్నాను. ప్రియమైన నా మేరీ, నేనీ జీవితంలో నేర్చిన ఒక గొప్ప పాఠం నీకు చెబుతున్నాను: "నీ ఆదర్శం ఎంత ఉన్నతంగా ఉంటే నువ్వు అంత దుఃఖాన్ని అనుభవిస్తావు." ఈ లోకంలోగాని, ఈ జీవితంలోగాని అలాంటి లక్ష్యాన్ని పొందడానికి వీలులేదు. అది అసాధ్యమైన విషయం. కాబట్టి ఈ లోకంలో పరిపూర్ణతను పొందగోరేవాడు ఒక పిచ్చివాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Priya+Mitrulaku**

* * *